# బాపూ బొమ్మ - 8

మా ఊరును తలచుకుంటేనే నాకు మైమరపు వచ్చేస్తుంది! కరువు సంగతే నేను వినలేదు! అందుకే నాకు తెలిసిన సంగతుల్ని పూనకం వచ్చినట్లుగా ఏకబిగిన హుషారుగా చెప్పేసాను.

''మీరలా అనుకుంటున్నారా...? మా ఊళ్ళో వాళ్ళంతా ఒళ్ళొంచి కష్టపడి పనిచేసే వాళ్ళే! ఏ సంవత్సరమైనా... తుఫానో, అకాల వర్షాల వలనో అనుకున్నంత దిగుబడిరాక కొందరు రైతులు పాపం ఇబ్బందులు పడుతూంటారు. అప్పులతో సతమతమయ్యే కుటుంబాలని కొందరు పెద్దమనసుతో ఆదుకోవటమూ జరుగుతూంటుంది !

'ఊరు అన్నాక, అందరూ కలిసి సమస్యల్ని సానుభూతితో అర్థం చేసుకుని, ఒకరికొకరు సాయంగా నిలబడితే కరువన్నది మన దరిదాపులకి కూడా రాలేదు' అని మా పెదనాన అంటూ ఉంటారు! అందుకేనేమో... తిండికి ఎవరూ ఇబ్బంది పడినట్లుగా వినలేదెపుడు. పండుగలపుడు ఊరంతా సందడీ, సంబరమే! అట్టహాసం, ఆడంబరం లాంటివి ఉండకపోవచ్చునుగానీ, సరదా, సంతోషాలకి మాత్రం లోటుండదు!

మా పెదనాన్నలవీ, మాదీ, మూడిళ్ళూ... పేరుకి విడివిడిగా ఉంటాయేగానీ అందరం కలివిడిగా ఒకే కుటుంబంలా ఉంటాం! ఏ పండుగ వచ్చినా పట్నంలో ఉండే బాబాయ్, రెండు గంటల బండి ప్రయాణం దూరంలో ఉండే ముగ్గురు మేనత్తలూ తప్పనిసరిగా రావాల్సిందే. మా అత్తలెవరూ ఉత్త చేతుల్తో రారు... వెళ్ళరు కూడా! వెంట పళ్ళబుట్టలూ, పిండివంటలు దండిగా ఉండాల్సిందే! పండగలకి ఎపుడైనా కొంచెం ఎడం వస్తే చాలు, 'ఒకసారి వచ్చి వెళ్ళకూడదూ..?' అని ఇటునుండి అన్నగార్ల పిలుపులు! 'అవును.. అందర్నీ చూడాలనిపిస్తోంది' అనుకుంటూ ముగ్గురూ కూడబలుక్కుని, బళ్ళు కట్టించుకుని పిల్లాజెల్లాతో అటునుండి చెల్లెమ్మల పరుగులు!'' అంటూ నవ్వి మళ్ళీ వెంటనే కొనసాగించాను.

''మా అత్తలున్నన్ని రోజులూ ఎక్కడో ఒక్కచోటే వంట ఉంటుంది! రోజూ విందు భోజనాలు... పరిహాసాలతో కబుర్లూ..! ఇక పిల్లల గుంపు కేరింతలూ, ఆటపాటలూ, అల్లరి ఆకతాయి పనులకూ అంతే ఉండదు.. ఒకటే జాతరలా ఉంటుంది!''

అత్తగారు నా వేపు బుగ్గన వేలేసుకున్నట్లుగా వింతగా చూసింది! అవును మరి.. ఆ ఇంటికి వచ్చాక నేనలా అంతసేపు మాట్లాడటం అదే మొదటిసారి!

నా వేపు చాలా తిరస్కారంగా చూసి '' చాలు చాల్లే.. పెద్ద చెప్పొచ్చావ్.. మీ వాళ్ళ గురించి ! నీ పెళ్ళిలో చూసాగా.. ఎవరి ఒంటిమీద వంకీ, వడ్డాణం లాంటివి లేనే లేవు! అయినా పకపకలకీ, వికవికలకీ మాత్రం లోటు లేదు! 'జరుగుబాటు తక్కువా, విరగబాటు ఎక్కువా' అన్నట్లుంది వాళ్ళ వ్యవహారం!'' అంది.

నవ్వులకీ, నగలకీ సంబంధం ఏమిటసలు..?! ఆశ్చర్యపోయాను.

చెప్పింది వినాలే తప్ప నేను ఎక్కువగా మాట్లాడటమే అత్తగారికి నచ్చదు! ఇక ఉల్లాసంగా మాట్లాడితే ఎలా సహించగలదు..? పుల్ల విరుపు మాటలతో సమాధానం చెబితేనే గానీ ఆమెకు సంతృప్తి కలగదు! నా ఆనందాన్ని తుంచేసి జయించినట్లుగా ఆవిడ పెదవులపైకి చిరునవ్వు వచ్చింది! ఇతరులకు మాటలతోనో,

చేతలతోనో సంతోషం కలిగించి ఆనందించే వాళ్ళతో పాటూ, మాటల ములుగర్రతో నొప్పించీ, సంతృప్తి పడే వాళ్ళు ఉంటారని నాకు ఆ ఇంటికి వచ్చాకనే అనుభవమైంది!

అప్పుడు మా అత్తగారు పిడుగుపాటు లాంటి ఓ మాట నిదానంగా చెప్పింది!

''పండుగ మా ఊళ్ళోనే వైభవంగా జరుగుతుంది! ఈ ఊళ్ళో ఎలా ఉంటుందో మీ అమ్మాయీ తెలుసుకుంటుంది! ఆపైన.. మద్రాసు పైన నీలగిరో మరొకటో ఏదో ఊరిపేరు మా వాడు చెప్పాడు.. అక్కడికి ఇద్దరూ కలిసి వెళ్ళి నాలుగురోజులు చక్కగా గడిపివచ్చే ప్రోగ్రాం ఏదో ఉంది.. ఏర్పాట్లు చేసుకుంటున్నారు.. కనుక అనవసరంగా పిలవటానికి రానవసరం లేదని' మీ నాన్నకి చెప్పమని ఆయనతో కబురు పంపించా!''

నా ఆనందం బుడుగలా టప్పున పేలిపోయింది!

నిర్ఘాంతపోతూ చలనంలేని బొమ్మలా బిగుసుకుపోయాను!

'నన్ను అడగకుండా మీ అంతట మీరే సమాధానం చెప్పెయ్యటం ఏమిటీ...? నేను తోలు బొమ్మలా మీరు ఆడించినట్లల్లా ఆడాలా....? నాకు ఇష్టాయిష్టాలు ఉండవా? పెళ్ళితో నా మీద అధికారమంతా మీదే అవుతుందా...? పెద్దవాళ్ళుగా అనుభవంతో మంచీ చెడు చెబితే వింటానుగానీ.. నాకు ఇష్టం లేని పనుల్ని ఆజ్ఞాపిస్తే నేను పాటించను ! మీకు అభ్యంతరం ఉంటే రావద్దు. నేను మాత్రం నాన్న వెంట మా ఊరికి వెళ్ళే తీరతాను! ఏం చేస్తారు... ఏం చేయగలరు...?'

నా కోపాన్ని, ఆవేశాన్ని వెళ్ళగక్కుతూ ఆవిడను రెండు చేతులతో గుంజి పట్టుకుని అలా అడగగలిగితే ఎంత బావుంటుందీ!

లేకపోతే... ఈ ఊళ్ళోనే పండగ సంబరం బావుంటుందట ! ఇక్కడే.. ఈ ఇంట్లో అష్టయిశ్వర్యాలూ ఉన్నాయని అత్తగారి అభిప్రాయం!

నాకు మాత్రం అష్టదరిద్రాలు తిష్టవేసినట్లుగా అనిపిస్తుంది!

మా ఊరు వచ్చి... మా ఇంట్లో, మా వాళ్ళతో కలిసి ఓ పదిరోజులు ఉంటే, అప్పుడు ఆనందంగా జీవించటమంటే ఏమిటో ఆవిడకు తెలుస్తుంది!

మనుష్యుల మధ్య మనిషిలా బ్రతకటం అర్థమౌతుంది!

నా దృష్టిలో వాళ్ళిద్దరూ.... మనుష్యుల రూపంలో ఉన్న యంత్రాలు మాత్రమే!

మనుష్యుల కుండే స్పందనలు ఉండవు! ఒక యంత్రం డబ్బు కూడబెట్టడం, మరొకటి ఖర్చు చేయటంలో శ్రమ పడుతుంటాయి!

వీళ్ళకి అప్యాయతానురాగాల విలువ తెలియనే తెలియదు! అందుకనే నేను మనసంతా నింపుకుని వచ్చిన ఆదరాభిమానాలను అందుకునే ప్రయత్నమే చేయలేదు! విసిరికొట్టారు! మనసులోనే రోషంతో బుసలు కొట్టాను!

అత్తగారు నావేపు అసహనంగా చూసి '' నేను అప్పగింతలపుడే... మా ఆనవాయితీ సంగతి చెప్పానా... నువ్వు నెల తప్పేవరకూ, పండగలు.. పబ్బాలంటూ రాకపోకలేం ఉండవన్నానా... మరి... ఇప్పుడు ఇలా

కబురు పెట్టడం ఎందుకటా...?''అంటూ అక్కడినుండి లేచి వెళ్ళిపోయింది.

నేను గదిలోకి వచ్చి మంచం మీద పడ్డాను.

అవును.. అమ్మావాళ్ళదీ తప్పే!

ఆరోజు.. అత్తగారి మాటల్ని ఎందుకు ఖండించలేదూ....! ఆ పద్ధతి సమ్మతం కాదని ఎందుకు గట్టిగా చెప్పలేకపోయారూ...?

అరిటాకు వెళ్ళి ముల్లు మీద పడ్డా, ముల్లు వచ్చి అరిటాకు మీద పడ్డా, అరిటాకుకే కదా నష్టం...!

పిల్లనిచ్చుకున్న వాళ్ళం... అణగిమణిగి ఉండాల్సిందే.... తప్పదు ! లేకపోతే అసలుకే మోసం అన్నట్లుగా పిల్ల కాపురానికే ముప్పు వస్తుంది!

ఇలాంటి పాతకాలపు పనికిమాలిన సామెతలూ, ఆలోచనలూ అమ్మావాళ్లని ఎదురు మాట్లాడనివ్వకుండా కట్టడి చేసి ఉంటాయి!

ఒకవేళ నాన్న... మా అమ్మాయి ఇంటికి ఎవరో రావద్దంటే మానెయ్యటం ఏమిటీ అనుకుని వస్తారేమోననే ఆశ కూడా ఒక క్షణం నన్ను వూరించింది.!

నా ఇల్లు కాదు, మా అత్తగారిదే అనుకుంటే, నాది కాని ఇంట్లో నేనేందుకు ఉండాలీ ? ఉబికి వస్తున్న కన్నీళ్ళను లోలోపలి మంటను చల్లార్చటానికి వెనక్కి మళ్ళించే ప్రయత్నం చేశాను!

ఏదో చిన్న ఆశ మనసులో మినుకుమినుకుమంటూంటే.. నాన్న కోసం ఆ మరునాడు సాయంకాలం వరకూ ఎదురు చూశాను.

ఇక రారని నిర్ధారణ అయ్యాక నిరాశగా పెరట్లో మెట్టు మీద చతికిలపడ్డాను. ఏదో పని చేసుకుంటున్న రత్తాలుని చూసి అత్తగారు '' ఏమిటే నువ్వు కూడా కొపంలంటుకున్నట్లుగా ముఖం మాడ్చుకుని తిరుగుతున్నావూ....?'' అనడిగింది. అంటే.. నేను ఎప్పుడూ అలా ముఖం మాడ్చుకునే ఉంటానని దెప్పటమే!

నేను మాత్రం ఏం చేయనూ.... మనసులోని దిగులు వద్దన్నా ముఖంలోకి అలా వచ్చేస్తుంది కాబోలు!

'' ఏంటోనమ్మా... ఇంట్లో మా వాడితో, పిల్లతో ఒకటే రగడ! నాకెటూ పాలుపోవటం లేదూ....'' నిట్టూరుస్తూ దిగులుగా బదులు చెప్పింది రత్తాలు.

''ఏమయిందేం..?'' అత్తగారు మళ్ళీ ఆరా తీసింది.

రత్తాలూ చేతిలోని చీపురు పక్కన పడేసి చతికిలబడి కూర్చుని తీరుబడిగా వివరించింది.

'' ఆ మద్దెన.. మా ఊళ్ళో ఎగసాయం చేసుకునే వాడు, నాకు తమ్ముడి వరసయ్యే రాజయ్య అని ఒకడు ఇంటికి వచ్చి మా పిల్లనడిగాడు. చదూకుంటున్న అంత చిన్నపిల్లకి పెళ్ళేంటని కసిరికొట్టాం! కానీ.. ఆడు మాత్రం పట్టు ఇడవకుండా పదే పదే ఇంటి చుట్టూ తిరిగి మా మావని కల్లుపాకకి తిప్పీ ఎలాగో మనువుకి ఒప్పించేశాడు!

ఆడికి ముప్పై ఏళ్ళకి ఎక్కువేగానీ తక్కువుండవమ్మా. పెళ్ళయిన మాణ్ణెనెలలకే మొదటి పెళ్ళాం టపా కట్టేసింది. అందరూ ఏదో జబ్బు పేరు చెప్పుకున్నారుగానీ.. నేనేమో ఆడి చింతనిప్పుల్లాంటి కళ్ళు,

ఎద్దుల్లా ఉండే రూపు చూసి, గుండాగి చచ్చివుంటదని అనుకునేదాన్నండి ! ఇప్పుడేమో నా పిల్లనే ఆడికి కట్టబెట్టాలంటే మనసొప్పటం లేదు ! మావాడు నా మాట చెవిని బెట్టటం లేదు. పిల్లదేమో ఏడుపు ఆపటం లేదు. నాకు దిక్కు తోచకుండా ఉందమ్మా...''

అత్తగారు వెంటనే తకీమని సమాధానం చెప్పేసింది " ఇందులో అంత తలబద్దలు కొట్టు కోవల్సిందేం ఉందే రత్తాలూ...! మగవాడికి ముప్పై ఏళ్ళంటే పెద్ద వయసేం కాదు! మనుపటి రోజుల్లో అయితే యాభై అరవై ఏళ్ళ వాళ్ళు కూడా పదేళ్ళ పిల్లతో పెళ్ళికి రెడీ అయిపోయేవారు. ఇప్పుడెంతో నయం కదూ...? పిల్ల తొమ్మిదో తరగతి కదా చదూతోందని ఆ మధ్య చెప్పావూ... ఆడ పిల్లలు ఎంతలో ఎదిగివస్తారే... మూడు ముళ్ళు పడిపోతే ఇట్టే పెద్దరికం వచ్చేస్తుంది! పిల్లకి తెలియక ఏడిస్తే... నువ్వు తల్లివి నచ్చచెబితే ఎందుకు వినదూ...? ఏదయినా చెప్పే పద్ధతిలో చెప్పాలే! పెళ్ళితో కొత్త బట్టలూ, నగానట్రా అన్నీ వస్తాయని చెప్పు... ఎంచక్కా ఒప్పకుంటుంది."

" అవును... కొత్త బట్టలూ, నగలూ వస్తోంటే... నొప్పి ఎందుకే? అని నచ్చచెప్పి చూడు.. ఎగిరి గంతేసి ఒప్పకుంటుంది! అయినా రత్తాలూ... నీ పిచ్చిగానీ.. చదవూ చట్టు బండలూ ఎందుకే... కూటికా, గుడ్డకా...? ఎందుకూ పనికిరాదు! పెళ్ళి చేసి పంపేస్తే, నీకూ సుఖం... దానికీ సుఖం! కట్టుకున్నాడు ఏదో ఇంత తిండిపెట్టడా... తిని కూర్చోవటమేగా ! ఎలాగో ఒకలాగ రోజులు వెళ్ళ మారిపోతాయిగానీ ఆగిపోవు! ఇదే మీ పిల్లకి బాగా బోధించు...! "అన్నాను కచ్చగా.

రత్తాలుతో పాటుగా మా అత్తగారూ నా వైపు వింతగా చూసింది.

నెమ్మదిగా తేరుకున్న రత్తాలు అలాగే చూస్తూ ''అదేంటమ్మా... అలాగంటన్నారూ...?" అంది.

''ఏం బాగా చెప్పలేదా... నీకు నచ్చలేదా...? మన పెద్దవాళ్ళంతా చెప్పేది ఇదేకదా...?" నా మాటల్లోని వ్యంగ్యం అత్తగారికి అర్థమైనట్లు లేదు! అందుకేనేమో మళ్ళీ నచ్చ చెప్పే ప్రయత్నం చేసింది.

''అవునే రత్తాలూ.... నీ పిల్ల చదివి ఊళ్ళేలేస్తుందనుకుంటున్నావా...? ఎంత చదివినా నౌఖరీ చేసినా కూటికోసమేగా...? మా కోడలు చెప్పినట్లు కట్టుకున్నాడు తిండి పెట్టకపోడుగా...! పైగా కోరి వస్తున్నవాడిని కాదనుకుంటే... ఆ తర్వాత సంబంధం కోసం కాళ్ళరిగేలా తిరగొద్దూ... పెళ్ళి ఎప్పటికైనా తప్పతుందా ... కొంచెం ముందూ, వెనుకా అంతేగా! రేపు నీ పిల్లని వెంటబెట్టుకుని రా...' అమ్మానాన్నల మాట వినకుండా నీకీ మొండి పట్టుదల, పంతం దేనికే' అని చీవాట్లు పెడతా...''

''నేనూ చెబుతున్నానమ్మా. ఈడూజోడూగా ఉండేవాడయితే మొగ్గు చూపేదేమో తెల్వదు. ఈడి ఆకారం చూసి పిల్ల బేంబేలెత్తిపోతందేమో అనిపిస్తోంది! అక్కడికీ ఆడు పిల్లకి చదువు మీద మోజంటే, ఆళ్ళకి దగ్గర్లోనే పంతులు గారున్నారంట... ఆరి దగ్గర చదువుకోవచ్చన్నాడు. ఆ పంతులుగారే పరీక్షలకీ కట్టిస్తారట! ఆ మాట చెబితే, మా పిల్ల 'నేనా ఊళ్ళో ఎందుకు చదూకోవాలి, ఇక్కడే చదూకుంటా, పెళ్ళీగిళ్ళీ వద్దు అని తెగేసి చెప్పిందమ్మా!'' అంది రత్తాలు దిగులుగా మొహంపెట్టి .

నాకు చాలా ఆశ్చర్యమనిపించింది! ''ఏంటి రత్తాలూ... నీ కూతురు... అంత చిన్నపిల్ల... అంత తెలివిగా మాట్లాడిందా...!? అవును... నిజమేగా, పెళ్ళి చేసుకువెళ్ళి... వాళ్ళ దయాధర్మం మీద ఎందుకు

చదువుకోవాలీ..? వాళ్ళు కాదంటే... చదువు మానేసి వాళ్ళు చెప్పినట్లు వింటూ ఓ మూల పడి ఉండాలి! అలాంటి ఖర్మ లేకుండా తల్లిదండ్రుల దగ్గరే ఉండి, తన హక్కుగా తనకిష్టమైనంత కాలం చదువుకుంటుంది. ఆ తర్వాతే పెళ్ళి అన్నట్లుగా చెప్పిందంటే... తనకి ఎన్ని తెలివితేటలున్నాయో తెలిసిపోవటం లేదూ...? చక్కగా చదువుకోనియ్యండి...!'' అన్నాను, మనసులో ఈ మాత్రం ఆలోచన మా వాళ్ళకీ, నాకూ లేకపోయాయే అనుకుంటూ. నాకు తోచిన సలహా నిర్భయంగా చెప్పగలిగాననిపించింది.

''రత్తాలూ.. నాకు తెలీక అడుగుతానూ... ఇంట్లో కూర్చుని వండిపెట్టే, ఆడదానికి చదువు ఎందుకే....? మగవాళ్ళ అండలేని వాళ్ళు కష్టపడి చదివి... ఉద్యోగమో సద్యోగమో చూసుకుని తిండికి సంపాదించుకోవాలి గానీ....! ఏం... మన పెద్దవాళ్ళకీ, నీకూ నాకూ చదువు లేకపోతే ఏమయిందీ...? సంసారాన్ని చక్కదిద్దు కోలేదా...?''

కంఠస్వరంలో కోపాన్ని చూపిస్తూ నా మాటలకు సమాధానంలా రత్తాలుతో చెప్పింది అత్తగారు! అవును ... చదువు లేకపోతే మాత్రమేం... సరియైన సమాధానం నా నోటికి తాళం పడేలా చెప్పగలిగాననీ కూడా అనుకుని ఉండొచ్చు! నేను జవాబు చెప్పకుండా ఉండలేకపోయాను ''నిజమే రత్తాలూ... చదువుకోలేని ఆడవాళ్ళు తమ జీవితానుభవాలతో తెలుసుకో గలిగిన ఎన్నో మంచి విషయాలను పిల్లలకూ చెప్పగలిగేవారు! దీపం వెలిగించటం తెలియనపుడు చీకటికి అలవాటుపడిన నైపుణ్యంతోనే ఎన్నో పనులు చక్కబెట్టుకునీ ఉండొచ్చు! దీపం వెలిగించుకునే దారి తెలిసినప్పుడు కూడా చీకటిలోనే ఉందామనుకోవటం ఎందుకూ...? చక్కగా వెలుగులోనే పనులు చక్కబెట్టుకోవచ్చుకదా!ఇప్పుడు మనకు కరెంటు దీపాలు అందుబాటులోకి వచ్చాయా... మన పెద్దలంతా లాంతరు దీపాలతో సుఖంగా బతకలేదా అనుకుని ఆ లాంతరు దీపాలనే వాడాలని అనుకోవటం లేదు కదా...! అందుబాటులోకి వచ్చిన సౌకర్యాన్నీ వినియోగించుకోవాలనే మనం అనుకుంటాం ! అవునా..?! చదువంటే ఏమిటనుకుంటున్నావ్? చీకటిని దూరం చేసే జ్ఞానదీపం! ఇప్పుడు ఈ రోజుల్లో.... చాలామంది అమ్మాయిలు చక్కగా చదువుకుంటున్నారు! ఉద్యోగాలూ చేస్తున్నారు! చదువుతో... బయట ప్రపంచంలో ఏం జరుగుతోందో, ఎలాంటి మార్పులొస్తున్నాయో అన్నీ తెలుసుకోవచ్చు! మన ఇంటిలో మనం ఉంటూ నలుగురితో ప్రమేయం లేకుండా బ్రతకటం కాదు... మగవాళ్ళతో సమానంగా చదువుకుని, ఉద్యోగాలు చేస్తూ ఆడవాళ్ళూ ముందడుగు వేయాల్సిందే...!''

అత్తగారికి సమాధానం గా ఆవేశంగా చెప్పుకుపోతున్న నాకు వకృత్త్వ పోటీల్లో స్టేజి మీద నిలబడి మాట్లాడుతున్నట్లుగా స్పృహ కలిగి మధ్యలో హఠాత్తుగా ఆపేసాను! స్కూల్లో టీచర్లు చెప్పినవీ, చిన్నప్పటి నుండీ బాబాయ్ చెప్పే సూక్తులూ...వీటి ప్రభావంతో ఏదో గడగడ చెప్పుకుపోతున్నానని రత్తాలు బిత్తర చూపులతో అర్థమైంది! అందుకే నా మాటల ప్రవాహానికి అడ్డుకట్టు వేశాను!

''అందుకని రత్తాలూ... నీ కూతురు ఎంతవరకూ ఇష్టంగా చదువుకుంటానంటే అంత వరకూ చదివించు. పెళ్ళికేం తొందర లేదు! ఉద్యోగం సంపాదించేంత వరకూ చదవలేక పోయినా ఫరవాలేదు! ఎంతో కొంత వరకూ చదివినా ఏదో విధంగా విద్యవలన ఉపయోగమే గానీ నష్టం ఏం ఉండదు! ఏం... నీ ఇద్దరు మగపిల్లల్నీ కూలి పనులకి పంపిచాలని తొందర పడకుండా చదివించాలనుందని చెప్పావా

... అలాగే అమ్మాయినీ తన ఇష్ట ప్రకారం చదివించు. ఆడపిల్లలకు చదువెందుకనే తప్పు అభిప్రాయాన్ని వదిలిపెట్టండి...!'' నా ఆఖరి మాటగా చెప్పి ఇక అక్కడ నిలబడకుండా లోపలకు వచ్చేశా! నిజానికి రత్తాలుకి చెబుతున్నట్లుగా కాకుండా అత్తాకోడళ్ళు ఇద్దరం వాదించుకున్నట్లుగా ఉంది! అందుకే నేమో రత్తాలు అయోమంగా మా ఇద్దరి వైపు మార్చిమార్చి చూస్తుండి పోయిందనుకుంటా! లోపలకు వచ్చేస్తుండగా మా అత్తగారి సణుగుడూ, , ''ఏటోనమ్మా... నాకేం తెలవట లేదు...'' అని రత్తాలు దీర్ఘాలు తీయటం వినిపించింది!

★ ★ ★

నాలుగు రోజుల తర్వాత...

ఉదయమే అత్తగారు, ఆయనగారు నాగన్నతో బండి కట్టించుకుని ఏదో ఊరుకట ప్రయాణమై వెళ్ళారు. తిరిగి రావటానికి సాయంకాలం అవుతుందేమో అన్నట్లుగా చెప్పారు. మా అత్తగారు తరుపు బందువు ఎవరో చావుబతుకల్లో ఉంది కాబట్టి వెళ్తున్నామని అత్తగారు ఏదో చెప్పీ చెప్పనట్లుగా తెలియజేసింది!

ఆవిడ రాసిన వీలునామా ప్రకారం మా అత్తగారికీ కొంత వస్తుంది కాబట్టి అంత హడా వుడిగా వెళ్ళటం జరిగిందన్నట్లుగా ఆ తర్వాత రత్తాలు అంది. రత్తాలుకు తెలిసిన ఇంటి విషయాలూ నాకు తెలీవు! నా పరిస్థితి అలా ఉంది! దానికి నాకేం బాధలేదు! ఆ ఇంటి సంగతుల పట్ల నాకసలు ఆసక్తి ఉంటేకదా!

రత్తాలు తన పనులు పూర్తిచేసుకుని ఇంటి దగ్గర తనకేదో పనివుందని వెళ్ళిపోయింది. మామూలుగా అయితే సాయంకాలం వరకూ ఇక్కడే ఉంటుంది. మామూలుగానే ఏదో ఆలోచిస్తూ... గది లోకి అడుగుపెట్టిన నేను... ఒక క్షణం భయంతో బెదిరిపోయాను! ఆ ప్రయత్నంగా అరవబోయి ఆగిపోయాను. మరు క్షణమే నా బెదురు తగ్గింది.. కళ్ళు పెద్దవి చేసి చూశాను.

ఎవరో చిన్నపిల్ల.... నా మంచం పక్కన గోడకు ఆనుకుని నక్కికూర్చుంది. బెదురు చూపులతో కళ్ళను అటూ ఇటూ తిప్పుతోంది! ఆ పిల్ల తప్ప గదిలో ఇంకెవరూ లేరని రూఢి చేసుకున్నాక నెమ్మదిగా అడిగాను '' ఎ...ఎవరు నువ్వు...? ఇక్కడికి... ఎలా... ఎందుకు వచ్చావు...?"

ఆ చిన్నపిల్ల సమాధానం చెప్పకుండా వెక్కిళ్ళు పెట్టింది.

నాకు అయోమయంగా అనిపించింది. వెళ్ళి ప్రక్కన కూర్చుని '' ఎందుకు ఏడుస్తున్నావమ్మా నీకేం భయం లేదులే... నేనేం అనను. ఏడవకుండా విషయం ఏమిటో చెప్పు. నీ పేరేంటీ...?" అనునయంగా అడిగాను.

ఏడుపు కొద్దిగా ఆపి'' నీలమ్మ '' అంది.

"నువ్వు ఎవరి అమ్మాయివి...? ఏం చదువుతున్నావు...? దగ్గరికి తీసుకుంటున్నట్లు భుజం చుట్టూ చేయి వేసి అడిగాను.

''అమ్మ రత్తమ్మ.. నాన్న..'' అంటూంటే నేను ఆశ్చర్యంతో ''నువ్వు.. నువ్వు రత్తాలు కుతూరివా? " అడిగాను మధ్యలోనే అడ్డంపడి.

అవును అన్నట్లుగా తలవూపి.. ఎనిమిదో తరగతి చదువుతున్నానండీ...'' అంది. మొహంలోకి

వెలుగూ చిరునవ్వు వచ్చాయి.

‘‘అవునూ.. ఇక్కడికి.. ఎందుకు..ఎలా వచ్చావు...? అనడిగాను.

మొహంలోకి చిరునవ్వు పోయి దిగులు వచ్చింది.

‘‘అమ్మ... మా అమ్మ... నన్ను ఇక్కడ దాక్కోమని చెప్పిందండీ!’’ అంది.

నిర్ఘాంతపోయాను!

‘‘ఇదేమిటీ.. మీ అమ్మ... నిన్ను ఎందుకు దాక్కోమని చెప్పినట్లు...?’’

‘‘ఆ మొద్దు మామయ్య వచ్చి.. మమ్మలందర్నీ వాళ్ళూరికి.. అదేనండీ పెళ్ళికని తీసుకుపోతానని రంకెలు వేస్తున్నాడూ...!’’

ఆ రాజయ్యకి, ఈ పిల్ల ‘మొద్దు మామయ్య’ అని ముద్దు పేరు పెట్టింది కాబోలు!

నాకు కొంచెం నవ్వొచ్చింది! ఎందుకోగాని ఆ అమ్మాయీ పకపకమంది.

నేను తనవంక చూసేసరికి నవ్వు ఆపి తలవంచుకుని నెమ్మదిగా విషయం చెప్పింది.

‘‘పెద్దమ్మగారు ఊరెళ్ళారంటకదండీ... మీరొక్కరే ఉంటారని చెప్పి ఇక్కడ ఈ ఇంట్లో దాక్కుంటే... వాళ్ళు కనుక్కోలేరని అమ్మ నన్ను ఇంటి వెనకనుండి పంపించేసింది. ఆ వూరు నుండి వచ్చిన వాళ్ళు ఇంటిముందు ఉన్నారండీ.....!’’

నాకు విషయం అర్థం అయింది గానీ పూర్తిగా మాత్రం తెలియలేదు.

ఆ అమ్మాయిని నా పక్కనే కూర్చోబెట్టుకుని నెమ్మదిగా అన్ని విషయాలూ అడిగాను.

తనని వెతుక్కుంటూ ఎవరైనా వస్తారేమోననే బెదురుందేమో, అందుకని రహస్యం చెబుతున్నట్లు గొంతు తగ్గించి మెల్లమెల్లగా వివరించింది.

అప్పటికి నాకు సంగతి అంతా అర్థమైంది!

రాజయ్య, నీలమ్మల పెళ్ళికి నీలమ్మ తండ్రి అంగీకరించినా, పిల్ల గోల పెడుతోందంటూ,రత్తాలు అభ్యంతరం చెబుతోంది.

రాజయ్య వాళ్ళ బంధువులంతా అతని ఊళ్ళోనే ఉన్నారు. అప్పటికి నాలుగు రోజుల్లో మంచి ముహూర్తం ఉంది కాబట్టి రత్తాలు కుటుంబాన్ని ఆరోజే తమతో ఆ ఊరికి తీసుకుపోయి, పెళ్ళి కానిచ్చేద్దామనే ఆలోచనతో రాజయ్య నలుగురు బంధువులతో వచ్చాడు. వీళ్ళకు ముందుగా చెప్పకుండానే వచ్చేశారు. నిశ్చయం చేసుకుంటున్నట్లుగా పిల్ల కోసం చీర వగైరాలూ తీసుకువచ్చారు.

వాళ్ళు వెళ్ళిపోయేవరకూ ఇక్కడ ఉండమని రత్తాలే చెప్పి కూతుర్ని పంపించిందన్నమాట ! ఇదంతా విన్నాక నీలమ్మతో కబుర్లు చెబుతున్నట్లుగానే ప్రశ్నలూ వేస్తూ తన ఇష్టాలూ, అభిప్రాయాలూ అన్నీ తెలుసుకున్నాను.

నీలమ్మని చూస్తుంటే.. ఇంకా కొంచెం చిన్న వయసులో .. నన్ను నేను చూసుకుంటున్నట్లే అనిపించింది!

అయితే నాలా పొడుగు కాదు కాబట్టి ఇంకా పసిపిల్లలా ఉంది!

తనకి ఇప్పుడు పెళ్ళి చేసుకోవటం ఇష్టం లేదు. చదువుకోవాలని ఉంది. ఇంకా ఇద్దరు మగపిల్లల్ని చదివించాలి, కాబట్టి నీలమ్మకి పెళ్లి చేసి పంపించేయ్యాలనే ఆలోచనలో తండ్రి ఉన్నాడు. రత్తాలు అభిప్రాయాన్ని ఎవరూ ఖాతరు చెయ్యరు.

హైస్కూలు చదువు అయ్యాక, నీలమ్మని తన దగ్గర ఉంచుకుని కాలేజి చదువు చెప్పిస్తానని రత్తాలు అక్కగారు చెప్పిందట.

''మా పెద్దమ్మ పట్నంలోనే ఉంటుంది. పిల్లలు లేరు. నన్ను చదివిస్తానంటే మా నాన్నే ఒప్పుకోవటం లేదు. పెళ్ళి చేసేస్తే, చదువు బాధ్యతలన్నీ రాజయ్యే చూసుకుంటాడు... పిల్లని ఇంకెవరికో అప్పగించటమెందుకూ అని అమ్మతో గొడవ పెట్టుకుంటున్నాడు. ఈ పెళ్ళిగానీ తప్పిపోతే, నేను పెద్దమ్మ దగ్గరికి వెళ్ళిపోతాను! బాగా చదువుకుని లాయర్నో, టీచర్నో, అవుతాను...'' అంది నీలమ్మ.

ఆ అమ్మాయి ఆత్మవిశ్వాసం చూస్తుంటే, నాకు చాలా ముచ్చటనిపించింది!

''అలాగే తప్పకుండా నువ్వు చదువుకుందువుగానీ! ఈ పెళ్ళి తప్పించే ఉపాయం ఆలోచిద్దాం " అన్నా.

కాసేపటికి ఓ ఆలోచన వచ్చింది. నీలమ్మ స్కూలు టీచలర్లందరి గురించీ వాకబు చేశాను. అందరిలోకీ సుమతి అనే టీచరు నీలమ్మ చదువు గురించి బాగా శ్రద్ధ చూపిస్తుందని చెప్పింది. సుమతి భర్త కూడా మాష్టారే. ఆ స్కూల్లోనే ఉద్యోగం చేస్తున్నాడు. వాళ్ళిల్లు స్కూలుకి దగ్గర్లోనే ఉంటుంది.

అప్పుడు నేను సుమతి టీచరు పేరిట ఒక ఉత్తరం రాశాను.

నీలమ్మకి చదువుకోవాలని ఉన్న కోరిక, పెద్దవాళ్ళు చేస్తున్న పెళ్ళి గురించి తెలియజేశాను. నీలమ్మ మైనరు కాబట్టి పెళ్ళి చేయటం నేరమని, పిల్ల ఇష్టానికి విరుద్ధంగా జరుగుతోందని పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఇచ్చి ఆ పెళ్ళిని ఎలాగైనా ఆపమని మరీమరీ అభ్యర్థిస్తూ రాశాను.

నాకు బయటకు వచ్చే వీలు, అవకాశం లేవు కాబట్టి నీలమ్మ భవిష్యత్తు గురించి ప్రాధేయపడుతున్నాననీ రాశాను.

వాళ్ళిద్దరూ స్కూలు మాష్టార్లే కాబట్టి ఈ పని చేయటంలో ఇబ్బందేం ఉండదనిపించింది. నీలమ్మ కోరిక మీద నేను వాళ్ళ సాయం కోరాను. రుజువుతో నా ఉత్తరమూ వాళ్ళ చేతుల్లో ఉంటుంది కాబటి నిర్భయంగా వాళ్ళాపని చేయగలరనుకున్నా!

నీలమ్మ చేతికి ఆ ఉత్తరం ఇచ్చి తన సుమతి టీచరు ఇంటికి వెళ్ళి ఇమ్మని చెబుదామని అనుకుంటూండగానే ఎవరో తలుపు తట్టిన శబ్దం వినిపించింది.

నీలమ్మ ఉలిక్కిపడి బెదురుగా చూసింది.

నేను నిశ్శబ్దంగా ఫరవాలేదనట్లుగా సైగ చేసి తలుపు చేరవేసి ముందు గదిలోకి వచ్చాను. తలుపు తీయకుండా కిటికీ తలుపు తెరిచి చూశా.

వరండాలో నిలబడి ఉన్న మనిషిని పరకాయించి చూశాను. ఇంతెత్తున బలిష్టంగా ఉన్న అతనినీ, ఆ

రూపురేఖల్ని గమనించాక రాజయ్య అయివుంటాడనుకున్నా. ఇంట్లో ఎవరూ లేరని చెప్పి...' ఎవరు ఏమిటీ' అని అడిగాను.

నేనొక్కదానినే ఇంట్లో ఉన్నందువల్ల తలుపుతీయలేదని అనుకున్నాడేమో, అందుకని తను ఎవరో చెప్పి, నీలమ్మ ఎక్కడికి వెళ్ళిందో చూడమని, తన అక్కా, బావ పురమాయించినందువల్ల వెతుకుతూ అక్కడికి వచ్చానని చెప్పాడు.

నాకు రత్తాలు తప్ప నీలమ్మ తెలియదని, రాలేదని చెప్పగానే '' సరేనండి'' అంటూ వెళ్ళిపోయాడు. పిల్లలతో కలిసి ఆడుకోవటానికి అటు తోటలవేపు వెళ్ళిందేమో చూస్తాననీ చెప్పాడు. ఏదైనా గొడవ చేస్తాడేమోనని కొంచెం సందేహించానుగానీ,అలాంటిది లేకుండా నా మాట నమ్మినట్లు వెంటనే వెళ్ళిపోయాడు.

ఆకారం వేరేగా ఉందిగానీ, సౌమ్యుడే కాబోలు!

రత్తాలు చెప్పినట్లుగా అతన్ని చూసి నీలమ్మ భయపడటంతో వింత ఏం లేదు! చూసీ చూడగానే నేనే బెదురుతో ఉలిక్కిపడ్డాను! కాకపోతే ఇంటిలోపలినుండే కాబట్టి ధైర్యంగా పలుకరించాను.

ఎందుకైనా మంచిదని నీలమ్మని కాసేపు ఆపి, ఆ తర్వాత వెనక పుంత దారినుండి సుమతి టీచరు ఇంటికి వెళ్ళి, ఆ ఉత్తరం ఇచ్చి, సాయంకాలం వరకూ అక్కడే ఉండిపొమ్మనీ చెప్పి పంపించాను.

సగం సమస్య తీరినట్లుగా మనసు కొంచెం తేలికపడింది!

ఎందుకోగానీ అది నీలమ్మా వాళ్ళ సమస్యలా కాకుండా నాదే అన్నట్లుగా అనిపించింది మరి!

★ ★ ★